నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | JOGULAMBA GADWAL WANAPARTHY

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు

- అడ్డగోలు హామీలను సర్కారు నెరవేర్చక ఇబ్బందులు
- 'స్థానిక' ఎన్నికలకు గులాబీ శ్రేణులు సన్నద్ధమవ్వాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల

రేవంత్‌కు గుణపాఠం తప్పదు

లింగాల, ఫిబ్రవరి 11 : హామీలకు ఆశపడి కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రజలను గోస పెడుతుందని ఇలాంటి ప్రభుత్వానికి త్వరలో ప్రజలు గుణపాఠం చెప్పక తప్పదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలోని రాయవరం గ్రామంలో బీఆర్ఎస్ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గువ్వల మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చాక హామీలను నెరవేర్చక అవస్థలు పడుతున్నదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి నానా ఇబ్బందులకు గురిచేస్తున్నదని, అయినా వాటికి వెరవకుండా నిలబడిన పార్టీ శ్రేణులను ఆయన అభినందించారు. పార్టీ శ్రేణులు ప్రభుత్వం చేస్తున్న అరాచకాలతోపాటు ప్రజలకు చేస్తున్న మోసాలను వివరించి స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కేటీ తిరుపతయ్య, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు శ్రీనివాసులుయాదవ్, సేవ్యానాయక్, చందు, శంకర్‌నాయక్, హన్మంతునాయక్, నర్సింహ, మద్దిలేటి, రానోజీ, శివ య్య, గోబ్రియా, తిరుపతయ్య, జగపతి తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాల్సిందే..

జడ్చర్ల మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

- జడ్చర్ల మున్సిపాలిటీ ఎదుట కార్మికుల నిరసన

జడ్చర్ల, ఫిబ్రవరి 11 : జడ్చర్ల మున్సిపాలిటీలో పని చేసే మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆకుల వెంకటేశ్ డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులకు వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీ ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ జడ్చర్ల మున్సిపాలిటీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కింద అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఫిబ్రవరి 11వ తేదీ వచ్చినా జనవరి నెలకు సంబంధించిన వేతనాలను ఇవ్వలేదని, వేతనాల కోసం 220మంది కార్మికులు ఎదురుచూస్తున్నారన్నారు. ప్రతి నెలా జీతాలు ఇవ్వాలని ప్రభుత్వం సర్క్యులర్ ఉన్నా జనవరి నెలకు సంబంధించిన వేతనాలను ఇవ్వకుండా స్థానిక అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి వేతనాలను ఇవ్వాలని అడిగితే ఒకరు మీద ఒకరు వేసుకోవడమే కాకుండా ట్రెజరరీ ఆఫీస్‌లో పెండింగ్‌లో ఉన్నాయని చెబుతున్నారన్నారు. కార్మికులను ఒక్కరోజు పనిలోకి రాకుంటే ఉద్యోగంలో నుంచి తీసివేస్తామని బెదిరింపులకు పాల్పడే అధికారులు, పాలకవర్గం వేతనాలు ఇవ్వడంలో ఆలస్యం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

రాజాపూర్‌లో ఫ్లై ఓవర్!

బాలానగర్ (రాజాపూర్), ఫిబ్రవరి 11: రాజాపూర్ మండల కేంద్రంలో 44వ జాతీయ రహదారిపై పైవంతెన(ఫ్లై ఓవర్) నిర్మాణానికి ఎన్‌హెచ్ఏఐ అధికారులు శ్రీకారం చుట్టబోతున్నారు. ప్రస్తుతం బాలానగర్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై పైవంతెన నిర్మాణం పనులు కొనసాగుతున్న విషయం తెలిసిందే. తాజాగా రాజాపూర్ మండల కేంద్రంలో పైవంతెన నిర్మాణం పనులు చేపట్టనున్న ప్రాంతాన్ని మంగళవారం అధికారులు పరిశీలించారు. జాతీయ రహదారిపై, సర్వీసు రోడ్లపై ఉన్న తోపుడు బండ్లు, డబ్బాలు, ఇతర చిరు వ్యాపారాలను రెండు రోజుల్లో తొలగించాలని ఎన్‌హెచ్ఏఐ అధికారులు గ్రామస్తులకు సూచించారు. రాజాపూర్‌లో పైవంతెనతోపాటు జాతీయ రహదారిపై జేపీ దర్గా మలుపు వద్ద, షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట చౌరస్తా, బూర్గులస్టేజీ, ముదిరెడ్డిపల్లి స్టేజీ వద్ద కూడా త్వరలో పైవంతెనల నిర్మాణం చేపట్టనున్నట్లు సమాచారం.

జేఈఈ 2025 ఫలితాలలో రిషి హవా

ఎం.సాయి సుజన్‌రెడ్డి 98.40

సాయి అక్షయ 97.80

టి.తరుణ్‌సాయి 96.75

కె.సాహితిరెడ్డి 95.77

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి ఫలితాల్లో రిషి జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుంధుబి మోగించారు. మంగళవారం జేఈఈ ఫలితాలు వెలువడిన సందర్భంగా అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల వివరాలు రిషి విద్యాసంస్థల చైర్మన్ చంద్రకళావెంకట్ వెల్లడించారు. ఇటీవల జనవరిలో జరిగిన జేఈఈ మెయిన్స్ మొదటి విడుత పరీక్షలో అత్యధిక పర్సంటేల్ సాధించిన రిషి విద్యార్థులు వరుసగా సాయి సుజన్‌రెడ్డి 98.40, సాయి ఆక్షయ 97.80, తరుణ్ సాయి 96.75, సాహితీరెడ్డి 95.77, జోయా 95.09, ప్రణీత్‌కుమార్‌రెడ్డి 94.96, స్వర్ణకుమారి 93.64, ఇస్రార్ 92.09, రోహిత్ 91.61, ఈశ్వర్ 91.61, మనోజ్ఞ 91.20, నివేదిక 91.20 పర్సంటేల్ సాధించారు. వీరిని రిషి జూనియర్ కళాశాల చైర్మన్ చంద్రకళావెంకట్, అకాడమిక్ డీన్ లక్ష్మారెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డీన్ భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : జేఈఈ మెయిన్స్ 2025 మొదటి దఫా ఫలితాలలో ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. ఈ ఫలితాలలో ప్రతిభ కళాశాల విద్యార్థులు కె.కేథార్‌నాథ్ 98.28 పర్సంటైల్, ఎన్ వర్షిత్‌గౌడ్ 98.15, జీఎల్ఎస్ఎస్ వాత్సల్య 98.06, ఎం విశాల్ 97.12, నాగకౌశిక 96.95, సి. జతిన్ 96.03, కె. భరత్ 96.16, ఎం భానుప్రదీప్ 95.43, పి. సాయి జశ్వంత్‌రెడ్డి 95.39, ఎ. శివశంకర్ 94.3, వి సాకెత్ 94.19, జి. అంజనీ చరస్య రాఘవ్ 94.01, ఎ. నరేశ్ 93.20, జి. వైష్ణవి 93.84, ఎన్ అభిరామ్ 92.99, కె. మల్లేశ్ 92.42, కె.మానస 92.1 పర్సంటైల్ సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ ఫలితాలలో 90 పర్సంటైల్ ఆపైన 42 మంది విద్యార్థులు, 80-90 పర్సంటైల్ మధ్యలో 51 మంది విద్యార్థులున్నారు. అదేవిధంగా 219 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రతిభ కళాశాల డైరెక్టర్స్ కె. మంజులాదేవి, వి.లక్ష్మారెడ్డి, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, కె. జనార్దన్ రెడ్డి, జి. వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఎస్ వెంకట్రామయ్య, వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య తోపాటు అధ్యాపక బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

కె.కేదార్‌నాథ్ 98.28

ఎన్ వర్షిత్ గౌడ్ 98.15

జీఎల్ఎస్ఎస్ వాత్సల్య 98.06

ఎం.విశాల్ 97.12

వర్షాధార పంట సాగులో నష్టాలు

శనగసాగులో వర్షాధార పంటల సాగులో నష్టాలు అధికం కావడంతో ఆసక్తి చూపడం లేదు. నేను మూడు ఎకరాల్లో శనగ సాగు చేస్తే ఎకరానికి 5 క్వింటాళ్ల చొప్పున 15 క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చింది. బహిరంగ మార్కెట్లో విక్రయిస్తే క్వింటా రూ.6 వేలు అమ్మాను. పెట్టుబడి పోనూ ఇంకా ఎకరానికి రూ. ఐదువేల చొప్పున నష్టం వచ్చింది. పంట మొదట్లో తుఫాన్ ఎఫెక్ట్ వల్ల దిగుబడి సరిగా రాలేదు.

- గోపి, రైతు, తక్కశిల, అలంపూర్ మండలం

సగం దిగుబడే వచ్చింది..

నేను మూడు ఎకరాల్లో పప్పు శనగ పంట వేశాను. ఎకరానికి కేవలం నాలుగైదు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. గతంలో ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్లు వచ్చేవి. ఈ యేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట సరిగా పండ లేదు. అదీగాక పూత దశలో తుఫాన్ రావడంతో పూత రాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లింది. వచ్చిన పంటకు అయినా మద్దతు ధర వస్తుందనుకుంటే అదీ లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు కూడా ఏర్పాటు చేయలేదు.

- భాస్కర్, రైతు, భైరాపురం

వాణిజ్య పంటల సాగుపై రైతుల దృష్టి

రైతులు రానురాను వాణిజ్య పంటలపై దృష్టి సారిస్తున్నారు. అప్పట్లో సాగు నీరందక వర్షాధార పంటలే సాగు చేసేవారు. ప్రస్తుతం నీటి వనరులు పెరగడంతో వాణిజ్య పంటలపై దృష్టి సారించారు. వాతావరణ మార్పుల కారణంగా అనుకున్న స్థాయిలో పంటలు దిగుబడి రావడం లేదు. ఈ ఏడాది సాగు చేసిన రెండు నెలల వ్యవధిలో తుఫాన్ ఎఫెక్టుతో దిగుబడి రాలేదు.

- సక్రియానాయక్, ఏడీఏ

జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగైన శనగ పంట

రైతుల పాలిట శనిగ!

- గద్వాల జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం
- పెట్టుబడులు రాక రైతన్న దిగాలు
- మద్దతు ధర లేక అనాసక్తి
- వాణిజ్య పంటల వైపు పెరుగుతున్న ఆసక్తి
- వానకాలంలో 7,697 ఎకరాల్లో సాగు
- యాసంగిలో 15,222 అంచనా

అలంపూర్, ఫిబ్రవరి 11 : నడిగడ్డ ప్రాంతంలో శనగ ప్రధాన పంటగా ఉండేది. ఇక్కడి నల్లరేగడి భూముల్లో పంట సాగు చేసిన తర్వాత కేవలం ఒక్క వర్షం కురిసినా రైతులు ఆశించిన మేరకు దిగుబడులు వచ్చేవి. రానురాను వర్షాభావ పరిస్థితులు అనుకూలించక పంటల సాగు బాగా తగ్గుతూ వస్తున్నది. దీంతో ప్రస్తుతం శనగ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతేడాది ఓ మాదిరి దిగుబడులు వచ్చినప్పటికీ ఈ యేడాది వాతావరణ మార్పు ల కారణంగా పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో చాలామంది రైతులు శనగకు బదులుగా వాణిజ్య పంటలపై మొగ్గు చూపుతున్నారు.

పప్పుశనగ సాగు ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 7,697 ఎకరాల్లో శనగపంట సాగు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. అయితే యాసంగి పంటగా పప్పుశనగ పంట సాగు సుమారుగా 15,222 ఎకరాల్లో రైతులు సాగు చేయవచ్చని అధికారులు అంచనా వేశారు. ఈ అంచనాలు తారుమారు చేస్తూ కేవలం సగానికి సగం తగ్గిపోయింది. అలంపూర్, గద్వాల రెండు నియోజకవర్గాల్లో అత్యల్పంగా మల్దకల్ మండలంలో 30 ఎకరాల్లో సాగు చేయగా అత్యధికంగా ఎర్రవల్లి మండలంలో 2,650 ఎకరాల్లో సాగయ్యింది. ఉండవెల్లి మండలంలో 1,656 ఎకరాలు, అలంపూరు మండలంలో 1,195, వడ్డేపల్లి మండలంలో 844, మానవపాడు మండలంలో 544, రాజోళి మండలంలో 407 ఇటిక్యాల మండలంలో 230, అయిజ మండలంలో 141, ఎకరాల్లో సాగు అయింది. గద్వాల, గట్టు, ధరూర్, కేటీదొడ్డి మండలాల్లో ఒక్క ఎకరం పప్పు శనగ పంట కూడా సాగు చేసినట్టు లెక్కలు లేవు.

గతేడాదికంటే ఎక్కువ..

పప్పుశనగ పంట గతేడాది 5,356 ఎకరాల్లో సాగు కాగా, ఈ ఏడాది 7,697 ఎకరాల్లో సాగైం ది. గతేడాదితో పోల్చితే ఈ సారి 2,337 ఎకరాల్లో సాగు పెరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్నప్పటి లెక్కలు పరిశీలిస్తే గత 20 ఏండ్ల కిందటి లెక్కలు చూస్తే నడిగడ్డ ప్రాంతంలో సుమారు 70 వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేసినట్టు తెలుస్తుంది. సరైన నీటి సౌకర్యం లేకపోవడం వల్ల వర్షాధార పంటగా అప్పట్లో అత్యధికంగా సాగు జరిగింది.

ప్రభుత్వం నుంచి రైతులు ఆశించినంతగా మద్దతు ధరలు లేకపోవడంతో శనగ పంట సాగుపై ఆసక్తి చూపే వారు కారు. ప్రత్యేక తెలంగాణ అనంతరం సాగునీటి కొరత తీరడంతో రైతులకు ఉచిత కరెంట్, కావలసినంత సాగు నీరు అందడంతో శనగ పంటలకు బదులుగా వాణిజ్య పంటలపై రైతుల దృష్టి మళ్లింది.

గద్వాల జిల్లాలో శనగ సాగు వివరాలు

ఏడాది	అంచనా..	సాగు (ఎకరాల్లో)
2024-25	15,222	7,697
2023-24	20,442	5,356
2022-23	25,063	11,693
2021-22	29,528	18,108
2020-21	39,990	15,883
2019 -20	42,251	18,094
2018-19	47,535	34,212

సర్వేకు నిరసన సెగ

- నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పనుల అడ్డగింత
- భూములు పోతే భవిష్యత్ ఏమిటని రైతుల ఆవేదన
- తిప్రాస్‌పల్లి-బాపురం మధ్య రాకపోకలు నిలిపి..
- ముప్పేట కదిలిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- పహారా మధ్య సర్వే పూర్తి చేసిన పోలీసులు

ఊట్కూర్, ఫిబ్రవరి 11 : నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణం కోసం చేపట్టిన భూ సేకరణ సర్వే పనులను మంగళవారం పోలీస్ పహారాతో చేపట్టారు. ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోతే భవిష్యత్‌లో తమ బతుకెట్లా సాగేదంటూ శివారు గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు కోల్పోతున్న వారికి ఎంత పరిహారం ఇస్తారు.. తమకెట్లా న్యాయం చేస్తారో చెప్పకుండా పోలీసులతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారంటూ బాధిత రైతులు ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల నిర్మాణంలో భాగంగా జీవో 69 ద్వారా మక్తల్ మండలం భూత్పూర్ రిజర్వాయర్ నుంచి కాన్‌కుర్తి వరకు మూడు చోట్ల నీటిని లిఫ్ట్ చేసేందుకు ప్రభుత్వం మొదటి దశ పనులను ప్రారంభించింది. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం టెండర్ ప్రక్రియను సైతం పూర్తిచేసి మెగా ఇంజినీరింగ్ కంపెనీకి పనుల నిర్మాణం బాధ్యతలను అప్పగించింది. భూత్పూర్ రిజర్వాయర్ నుంచి ఊట్కూర్ పెద్ద చెరువు దాకా ఫేజ్-1 ఫేజ్ -2లో భాగంగా ఊట్కూర్ పెద్ద చెరువు నుంచి నారాయణపేట మండలం జయమ్మ చెరువుకు అక్కడి నుంచి కాన్‌కుర్తి చెరువు దాకా మూడు పంప్‌హౌస్‌ల నిర్మాణం, ఓపెన్ కెనాల్, పైప్‌లైన్, విద్యుత్ సబ్ స్టేషన్‌ల నిర్మాణం కోసం భూ సేకరణ సర్వే చేపట్టింది. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన భూత్పూర్ రిజర్వాయర్ నుంచి మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాలకు సాగు నీటిని తరలించేందుకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి లిఫ్టు పనులకు శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభ దశలోనే రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత మొదలైంది. వారంరోజుల నుంచి రైతులు తమ పొలాల్లో భూ సేకరణ సర్వే కోసం వచ్చిన రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులను అడ్డుకొని తిప్పి పంపిస్తున్నారు. రైతుల ఆందోళనను లెక్క చేయకుండా ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని సర్వే పనులను పూర్తి చేయిస్తోంది.

ముప్పేట కదిలిన అధికారులు..

ఆయా మండలాల్లో భూ సేకరణ కోసం అధికారులను రైతులు ప్రతిఘటిస్తుండడంతో మంగళవారం ఊట్కూర్ మండలం ఓబ్లాపూర్ శివారులో భారీగా పోలీసులను మోహరించారు. నారాయణపేట డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో ఇద్దరు సీఐలు, ఇద్దరు ఎస్సైలు దాదాపు ముప్పైకి పైగా కానిస్టేబుళ్లు, మహిళా కానిస్టేబుళ్ల భద్రత మధ్య రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సర్వే పనులను పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఊట్కూర్ మండలం బాపురం శివారులోని సర్వే నెంబర్ 30లో ఉన్న 70ఎకరాల ప్రభుత్వ భూమికి తాసీల్దార్ చింత రవి దగ్గరుండి కొలతలు చేయించారు. సర్వే జరుగుతున్నంత వరకు తిప్రాస్‌పల్లి, బాపురం గ్రామాల మధ్య ప్రజల రాకపోకలను పోలీసులు అడ్డుకున్నారు. అధికారులకు తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తున్న బాపురం గ్రామ రైతులను ఎస్సై కృష్ణంరాజు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామ శివారులోనే అడ్డుకున్నారు. ఇరిగేషన్ డీఈ కేతన్‌కుమార్, ఏఈఈ వెంకటప్ప, ఆర్ఐ మక్తల్ సీఐ చంద్రశేఖర్, మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, ఊట్కూర్, మరికల్, మాగనూర్, మక్తల్, కృష్ణ మండలాల పోలీసులు, రెవెన్యూ అధికారులున్నారు.

ఊట్కూర్ మండలం బాపురం శివారులో పోలీసు పహారా మధ్య సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుంటాం..

నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం పనులకు రైతులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలి. బాపురం శివారులోని సర్వే నెంబర్ 30లో సుమారు 79ఎకరాల అసైన్డ్ భూమి ఉండగా ఇందులో మిగులు భూమికి కొలతలు నిర్వహిస్తున్నాం. ఇదేక్రమంలో రైతుల నుంచి అందిన వినతులను సైతం పరిశీలన కోసం ఉన్నతాధికారులకు పంపిస్తున్నాం. సర్వే విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని సూచించారు. అభ్యంతరాల నోటిఫికేషన్ వెలువడిన 60 రోజుల్లోగా అధికారులకు తెలియజేసేందుకు అవకాశం ఉంటుందన్నారు.

-చింత రవి, తాసీల్దార్

తండాల్లో భూముల సర్వే

- పోలీసుల బందోబస్తు మధ్య అధికారుల సర్వే
- ఆందోళన చెందుతున్న రైతులు

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

దామరగిద్ద, ఫిబ్రవరి 11 : జాయమ్మ చెరువు రిజర్వాయర్ విస్తరణలో భాగంగా దామరగిద్దతండా గ్రామాల రైతుల భూముల్లో పవర్ స్టేషన్, పంపుహౌస్ నిర్మాణం కోసం మంగళవారం పోలీసు బందోబస్తు మధ్య సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా దాదాపు వందమంది పోలీసులను మోహరించి రోడ్డు పనులను మొదలు పెట్టారు. ఈ విషయంపై తండా రైతులు ఆందోళన చెందుతున్న సమయంలో కోస్గి సభలో మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్‌రెడ్డి కేటీఆర్‌కు తెలుపడంతో దామరగిద్దతండాకు వస్తానని చెప్పారని స్థానిక నాయకుడు బాబునాయక్ తెలిపారు. అదేవిధంగా సీపీఎం మండల నాయకుడు గోపాల్ మాట్లాడుతూ పక్కనే ఉన్న నల్లగుట్టలో పంపుహౌస్, పవర్ స్టేషన్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్ లబ్ధి కోసం రైతుల భూములు తీసుకోవడం సరియైనది కాదని, భూమి కోల్పోతున్న రైతుల తరపున పోరాటం చేస్తామని, వారికి అండగా నిలుస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జోషి, అంజిలయ్యగౌడ్, అరుణ్‌కుమార్ శరణ్యానాయక్‌తోపాటు తండా రైతులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో వాగ్దేవి ప్రభంజనం

రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 : జేఈఈ మెయిన్ మొదటి సెషన్ పరీక్ష ఫలితాల్లో మహబూబ్‌నగర్ వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం సృష్టించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు జనవరి 22వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నిర్వహించిన జేఈఈ పరీక్ష ఫలితాల్లో రేవంత్‌రెడ్డి 97.7 పర్సంటైల్, నవనీత్‌గౌడ్ 90 పర్సంటైల్ సాధించారు. వీరితోపాటు నవీన్, ఆశ్విని, రాంచరణ్, జునేత్, ఓంకార్, ఆర్తి, సురేశ్‌నాయక్, కస్తూరి , శివ, ప్రభాస్, గోవింద్ తదితర విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించి అడ్వాన్స్‌కు ఎంపికయ్యారు. వీరిని కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విజేత వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ చదువుతూ ఇంటర్‌తోపాటు జేఈఈ జాతీయస్థాయి పరీక్షలో కూడా రాణించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇదేవిధంగా కష్టపడుతూ ఏప్రిల్ నెలలో జరిగే రెండో సెషన్‌లో కూడా అత్యుత్తమ పర్సంటైల్ సాధించి తల్లిదండ్రులకు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఐఐటీ, నీట్ అకాడమీ ఇన్‌చార్జి పావనిరెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, అధ్యాపకులు రాఘవేందర్‌రావు, షాకీర్, యాకుబ్, సందీప్, గోవింద రాజులు, రాంరెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.